విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

అంబేద్కర్ ఆదర్శనీయుడు : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్పం (జన్ బాగీదరి) కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై సాంఘిక సంక్షేమ సాధికారత శాఖ గురువారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ప్రారంభించారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ముందుగా కలెక్టరేట్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె శోభారాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర- ఏలూరు: కళలను ప్రోత్సహించాలని కోఆప్షన్ సభ్యులు ఎస్ఎన్ఆర్ పెదబాబు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్తంగా ఏలూరులోని వైఎంహెచ్ఏ హాల్లో నిర్వహించిన "సాహిత్య కళాకారుల విశిష్ట సాహితీ పురస్కారాలు" కార్యక్రమానికి నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కళలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పిల్లంగోల శ్రీలక్ష్మి ఎంతో చిత్తశుద్ధితో పనిచేసే సాహిత్య అకాడమీ చైర్మన్ పదవికి వన్నె తేవడమే కాకుండా ఏలూరు నగరానికి ఒక గుర్తింపు తీసుకువచ్చారని పెదబాబు అన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఎం ఆర్ పెదబాబు,పలువురు కార్పొరేటర్లు సాహిత్య అకాడమీ చైర్మన్ పెళ్ళాం పిల్లంగోల శ్రీలక్ష్మి కి బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఎస్ ఎం ఆర్ పెదబాబు,పలువురు కార్పొరేటర్లు విశిష్ట సాహితీ పురస్కారా గ్రహీతలను సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బత్తిన విజయ్ కుమార్,సబ్బన శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీను,పొలిమేర దాసు, తంగెళ్ళ రాము,సున్న కిషోర్,పాము శ్యామ్యూల్, జనపరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఛాయాచిత్ర ప్రదర్శన

విశాలాంధ్ర-ఏలూరు: డా.బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రారంభిం చారు. ఈనెల 19వ తేదీన అమరా వతిలో స్మృతివనం ప్రారంభోత్సవం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ విష్కరణ వంటి మహాక్రతువుల నేపథ్యంలో సామాజిక సమత సంకల్పం పేరిట జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఏలూరు జిల్లాకలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సాంఘీక సంక్షేమ శాఖ, జిల్లా సమాచార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ జీవిత చరిత్రపై ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. డా.బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన ఫొటోలు, ఇతర ఘటనలకు సంబంధించిన ఛాయాచిత్రాలు సందర్శకులను ఆలోచింపజేశాయి. ఏలూరు నగరపాలక సంస్థ, ఇతరుల నుంచి సేకరించిన డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించి, అంబేద్కర్ రచించిన పలు పుస్తకాలతో కూడిన పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్ పి డి. మేరీ ప్రశాంతి తిలకించారు. తొలుత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈఛాయాచిత్ర ప్రదర్శన తిలకించిన వారిలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి,జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి,అడిషనల్ ఎస్ పి ఎన్.సూర్యచంద్రరావు తదితరులున్నారు.

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్షలు

విశాలాంధ్ర -భీమవరం: రైల్వే ఉద్యోగులకు నష్టం కలిగించే కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతినే అమలు చేయాలని ఎంప్లా యీస్ సంఘ్ భీమవరం బ్రాంచి కార్యదర్శి శ్రీ సంధి విజయకుమార్ డిమాండ్ చేశారు. కొత్త పింఛను విధానం రద్దు కోరుతూ ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పిలుపుమేరకు గురువారం జంక్షన్ రైల్వే వద్ద రైల్వే ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను ప్రతి ఉద్యోగి హక్కు అని యాజమాన్యం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. పదవీ విరమణ తర్వాత ఉద్యోగి కుటుంబ సభ్యులకు పింఛనే ఆధారమని, అదే పింఛన్ నగదును షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంతో ఉద్యోగికి భద్రత లేకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బొంతు శ్రీకాంత్, నాయకులు కార్యకర్తలు, కార్మికులు హాజరయ్యారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ సమస్యను రద్దు చేయాలని వినతి

విశాలాంధ్ర - కైకలూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ సమస్యపై ప్రభుత్వానికి నివేదించాలని మీ ద్వారా ప్రభుత్వానికి నివేదించండి అని కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడెం వీర వెంకట సత్యనారాయణ స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణలను అభ్యర్థించారు. స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ యాక్ట్ ద్వారా వచ్చే పలు సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి యాక్ట్ రద్దుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎంఎస్ఎస్ రాజు, జనరల్ సెక్రెటరీ బందిల లక్ష్మణరావు, మహిళా ప్రతినిధి ఎండి. రజిమున్నీ,లైబ్రరీ సెక్రెటరీ కె. రమాదేవి,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ప్రతినిధి కే.మురళీ పవన్, సీనియర్ న్యాయవాదులు టీ. శ్రీనివాసరావు, ఎం. సత్యనారా యణ, కే.కోటయ్య, వెంకటప్పయ్య,రవిబాబు, జి.జితేంద్ర, ప్రసన్న కుమార్, గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- ఉంగుటూరు: సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని చేబ్రోలు సొసైటీ అధ్యక్షులు యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. గురువారం చేబ్రోలు జగనన్న కాలనీలో సంక్రాంతి సంబరాలను స్థానిక ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేసారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాలనీలోని రోడ్లను రంగు రంగుల రంగవల్లులతో మహిళలు అలంకరించారు. భోగిమంటలు, చిన్నారులపై భోగిపళ్ళు పోయడం, హరిదాసులు, గంగిరెద్దుల సందడి, పగటి వేషగాళ్ల మాటలగారడి , పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి స్థానిక మహిళలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రాయి లక్ష్మి,మనసల నాగమణి,షాజహాన్, కరణం బుజ్జి,ముత్తా బుజ్జి, ఆకుల మణికంఠ కాలనీ వాసులు మంగ, బాలరాజు, రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

హరిదాసులకు ఆదరణ కరువు

సంస్కృతి, సంప్రదాయం కనుమరుగు

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలందరూ సుఖ సంతోషాలతో భోగభాగ్యాలతో ఉండాలని ఆశీర్వదిస్తూ శ్రీమద్ర మారమణ గోవిందో హరి...జై వాసుదేవ గోవిందో హరి...అంటూ వేకువ జామునే హరినామ సంకీర్తనలతో పురవీధులలో సందడి చేస్తూ తిరిగే హరిదాసుల సంఖ్య అంతకంతకు తగ్గిపోతోంది. నుదుటి మీద, భుజాలు ,చేతుల మీద హరి నామాలు ధరించి,తలపై అలంకరించిన అక్షయపాత్ర, ఒక చేత్తో చిటికలు వాయిస్తూ ,ఇంకొక చేత్తో తంబుర మీటుతూ, మెడలో పూలదండలతో హరిదాసులు నగర సంకీర్తనలు చేస్తుంటే ధనుర్మాసం వచ్చిందని ఎవరికైనా గుర్తొస్తుంది. శ్రీమన్నారాయణనికి, హిందూ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా హరిదాసును భావిస్తారు.సంక్రాంతి పండుగ రోజుల్లో హరిదాసులు వీధుల్లోంచి వెళ్తుంటే ప్రజలు తమకు తోచిన రీతిన గౌరవిస్తారు. ఇప్పుడు ఆ ఆనవాయితీ కనుమరుగైపోతోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అపార్ట్మెంట్ల సంస్కృతి పెరిగిపోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గంగిరెద్దుల వారి మాదిరిగా కాకుండా హరిదాసులు నగర సంకీర్తన చేసుకుంటూ వెళ్ళిపోతూ ఉంటారు. వారి రాకను గమనించి జనం స్వచ్ఛందంగా వచ్చి ఏదైనా అక్షయపాత్రలో వేస్తే స్వీకరిస్తారు. లేదా ఆధ్యాత్మిక గీతాలు పాడుకుంటూ వెళ్ళిపోతూ ఉంటారు. ఇటు ప్రజలు, అటు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదరణ లేకపోయినా తాతలనాటి నుంచి వస్తున్న సంప్రదాయాన్ని వదలడం ఇష్టం లేక టూ వీలర్ పై తిరుగుతూ హరినామ స్మరణ చేస్తున్నానని అంటున్నారు.ఏలూరు బావి శెట్టి వారి పేటకు చెందిన వీరనాల సుబ్బారావు. ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో నెల అంతా ఏలూరు పరిసర ప్రాంతాలైన వేగివాడ ,చాటపర్రు, పెదపాడు తదితర గ్రామాల్లో నగర సంకీర్తన చేస్తూ ఉంటానని ఆయన అన్నారు. ఏలూరులో తనలా మరో 10 మంది హరిదాసులు ఉన్నారని ఆయన చెప్పారు. కిలోమీటర్ల మేర దూరం నడవలేక బైక్ పై తిరుగుతున్నానన్నారు. మామూలు రోజుల్లో దుస్తుల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటానని ఆయన అన్నారు. తరతరాలుగా వస్తున్న ఎంతో విలువైన, గొప్ప హిందూ ధర్మాన్ని ,సంస్కృతిని కాపాడుకోవడానికి అందరూ ముందుకు వచ్చి సహకరించి భవిష్యత్ తరాలకు తెలియ చెప్పాలని ఆయన కోరుతున్నారు.

చిరువ్యాపారుల ఉపాధికి ఊతం.. జగనన్న తోడు

విశాలాంధ్ర-ఏలూరు: జగనన్న తోడు పథకం 8వ విడత కింద జిల్లాలో 16,289 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ. 17.23 కోట్లు లబ్దిదారుల ఖాతాలకు జమచేసినట్టు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు.గురువారం జగనన్న తోడు పథకం 8వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించినవారికి సంబంధించిన వడ్డీ రాయితీని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు. అనంతరం చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు, వడ్డీ రీయింబర్స్ మెంట్ నమూనా చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ చిరు వ్యాపారులు, సాంప్రదాయ వృత్తులవారి ఉపాధికి ఊతంగా జగనన్న తోడు నిలుస్తోందన్నారు. జగనన్న తోడు పథకం 8వ విడత కింద జిల్లాలో 16,289 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున రూ. 17.23 కోట్లు లబ్దిదారులకు జమచేసినట్టు తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ చిరువ్యాపారులు సాంప్రదాయ వృత్తులవారికి జగనన్నతోడు ఆపన్న హస్తంగా నిలుస్తోందన్నారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న తోడు ద్వారా అందిస్తున్న రూ. 10 వేల రుణం ద్వారా చిరువ్యాపారుల్లో ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు.

ఉంగుటూరు మండల సమావేశం గందరగోళం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం గందరగోళంగా జరిగింది. సమావేశంలో టిడిపి సర్పంచులు పలు సమస్యలపై మాట్లాడుతూ ఓ సర్పంచి అగౌరవంగా మాట్లాడటంతో సమావేశం సుమారు గంటపాటు అరుపులు, కేకలు మాటల యుద్ధంతో సాగింది. విషయం తెలుసుకున్న చేబ్రోలు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సమావేశంలో అధికారుల మధ్య ఎస్సై మణికుమార్ కూర్చున్నారు. పోలీసులు, మహిళా పోలీసులు సమావేశంలో జరుగుతున్న గందరగోళం వద్దకు వచ్చారు. అయినా తల్లాపురం సర్పంచ్ పసుపులేటి నరసింహారావు మాటలకు సభలో ఉన్న వైసీపీ సర్పంచులు శాంతియుతంగా బుజ్జగించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ సభ గౌరవాన్ని కాపాడాలే తప్ప, అమర్యాదగా మాట్లాడటం తగదని ఆవేశంగా మాట్లాడారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేస్తే ఎలా అని టిడిపి సర్పంచులు అన్నారు. మేము సమస్యలపై అడిగితే అమర్యాదగా మాట్లాడామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దానన్నారు. ఉంగుటూరు ఎంపీడీవో ప్రేమాన్విత మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తల సమ్మెతో కేంద్రంలో పిల్లల సంఖ్య తగ్గిందన్నారు. పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి అన్నారు. ఉంగుటూరు తహసీల్దారు ఏవి రమణారావు మాట్లాడుతూ మండలానికి 190 కొత్త రేషన్ కార్డులు వచ్చాయని వాలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ 35 పాఠశాలలు, రెండు అంగనవాడి కేంద్రాలు నాడు నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బందారు నాగరాజు, ఇంటి మంగరాజు, సర్పంచులు చదలవాడ రాజేంద్ర, కంకట పద్మలీల, వివిధ అధికారులు సుబ్రహ్మ ణ్యం, మల్లిపూడి చిన్న బాబురావు, సురేష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న ఏపీ హ్యాండ్ బాల్ జట్టు

విశాలాంధ్ర - లింగపాలెం : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలలో ఏపీ జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరుకోవటంతో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణరాజు, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి అలివేలు మంగ క్రీడాకారులను అభినందించారు. గత నెల 30వ తేదీ నుంచి రాజస్థాన్‌లో జరుగుతున్న ఈపోటీలకు ఏలూరుజిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికై పోటీలలో ప్రతిభ చూపుతున్నారని వీరు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు ఇచ్చిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని, వీరు తమ ప్రతిభతో సెమీఫైనల్‌కు చేరుకున్నారని వీరు తెలిపారు.

స్వామి వివేకానంద జయంతి

విశాలాంధ్ర -భీమవరం: స్వామి వివేకానంద స్ఫూర్తితో భారత నిర్మాణంలో యువత నడుం బిగించాలని ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వామి వివేకానంద చికాగో ప్రసంగం చిరస్మరణీయమని ప్రశంసించారు. వివేకానంద మార్గం అనుసరణీయమని యువత మేలుకొని ముందడుగు వేయాలని ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ అరవింద్ స్వామి, డాక్టర్ పి.రాజశేఖర్, ధనుంజయ్, పి.అమూల్యరావు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు వరం జగనన్న తోడు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: జగనన్న తోడు పథకం ద్వారా ఇస్తున్న రూ.10 వేలు రుణం ద్వారా చిరు వ్యాపారుల్లో ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం వరుసగా 8 వ విడత జగనన్న తోడు వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుండి జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి, యంబిసి చైర్మన్ పెండ్ర. వీరన్న, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు వర్చువల్ గా తిలకించారు.ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి జగనన్న తోడు ఎంతో సహాయంగా ఉంటుందని, సద్వినియోగం చేసుకుని ఆర్ధికంగా బలోపేతం కావాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వడ్డీ రాయితీ క్రింద 30,077 మంది చిరు వ్యాపారుల ఖాతాల్లో నేడు వడ్డీ రియంబర్స్ మెంటు క్రింద రూ.78,61,023 లు జమ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యంబిసి చైర్మన్ పెండ్ర వీరన్న , జిల్లా వార్డు, గ్రామ గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, డిఆర్డిఏ పిడి యన్ వియస్ ప్రసాద యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: రైల్వే ఉద్యోగ, కార్మికులకు నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, రైల్వేల ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ భీమవరం బ్రాంచి ఆధ్వర్యంలో భీమవరం రైల్వే జంక్షన్ వద్ద అపరిష్కృత డిమాండ్ల నెరవేర్చాలని గురువారం నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని కోనాల సందర్శించి వారి ఉద్యమానికి సంఘీభావం తెలిపి మాట్లాడుతూ రైల్వేలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రైల్వేల్లో ఖాళీగా వున్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్లు విలువ చేసే రైల్వే ఆస్తులను అదానీ, అంబానీలకు మోడీ దారాదత్తం చేస్తున్నాడని కోనాల విమర్శించారు. నవరత్నాలను నాటి ప్రధాని నెహ్రూ ఆధునిక దేవాలయాలతో పోల్చి ఎంతో గౌరవించారని, నేడు మోడీ నవరత్నాలను ప్రయివేటుకు దారాదత్తం చేస్తూ ప్రజా ధనాన్ని కార్పోరేట్లకు కొల్లగొడ్తున్నాడని దుయ్యబట్టారు. రైల్వే ఉద్యోగల పట్ల కేంద్రం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాల్ని విడనాడాలని, రైల్వే ఉద్యోగుల ఉపాధి, ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోనాల డిమాండ్ చేశారు. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ చేపట్టిన దీక్షకు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్ సంఘీభావం తెలిపారు. దీక్షల్లో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బ్రాంచి కార్యదర్శి సంధి విజయకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.వివేకన్ బాబు, సహాయ కార్యదర్శి కె.సూర్యనారాయణ, కోశాధికారి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు అనిల్ కుమార్, శేఖర్, సురేష్ రాజు,నాగవెంకటరావు తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సమాఖ్య నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఏలూరు: గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తి దారుల సమాఖ్య ముద్రించిన 2024 వార్షిక క్యాలెండర్‌ను చేతి వృత్తి దారుల సమాఖ్య ఏలూరు జిల్లా నాయకులు, సిపిఐ నాయకులు ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణలో చేతి వృత్తిదారుల ఏలూరు జిల్లా సమాఖ్య నాయకులు కడుపు కన్నయ్య, పొటేలు పెంటయ్య, పడాల సూరిబాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ,చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా చేతివృత్తులు కనుమరుగవు తున్నాయని పేర్కొన్నారు. కనుమరుగవుతున్న చేతి వృత్తులకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా సహకారం అందించి వృత్తులను ప్రోత్సహించాలని ప్రభుత్వాలకు నాయకులు విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్మికులు విధులకు హాజరు

విశాలాంధ్ర-ఏలూరు: ఈ నెల 3 నుండి ఏఐటియుసి నాయకత్వంలో మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో మంత్రివర్గం, మున్సిపల్ రాష్ట్ర స్థాయి అధికారులు జరిపిం చిన చర్చలు ఫలించడం మూలంగా మున్సిపల్ కార్మికులు సమ్మెను విరమించి గురువారం నుండి విధుల కు హాజరవుతున్నారని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కె కృష్ణమాచార్యులు, ఏ అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్చల సందర్భంగా అంగీకరించబడిన కోర్కెలకు సంబంధించి జీవోలు తక్షణమే విడుదల చేయాలని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్ , సప్లై కంప్యూటర్ వర్క్ ఇన్స్పెక్టర్ లకు సంబంధించి వేతనాలు పెంపుపై తొమ్మిది మంది అధికారులతో కమిటీ వేసి వారం రోజుల్లోపు రిపోర్ట్ సబ్మిట్ చేయాలని మంత్రివర్గం కోరింది. మంత్రివర్గం, డీఎంఏ అధికారులు ఒప్పుకున్న అంశాలను అమలు చేయని పక్షంలో ఫిబ్రవరి మాసంలో మరల సమ్మెకు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మెకు వెళ్తామని వారు తెలిపారు.

జాతి గర్వించదగిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర -ఏలూరు: ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన, భారత రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జీవితాన్ని భావి తరాలకు తెలియ జేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. విజయవాడలో ఈనెల 19వ తేదీన డా.బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఎస్పీ, జాయింట్ కలెక్టర్, పలువురు జిల్లా అధికారులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో అన్నింటికన్నా ముఖ్యమైంది రూల్ ఆఫ్ లా అని, రాజ్యాంగం దానిని నిర్దేశిస్తుందన్నారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ డా. బి. ఆర్. అంబేద్కర్ ఒక కులానికి, వర్గానికి చెందినవారు కారని, అంబేద్కర్ అందరివాడని అన్నారు.ఎస్ పి డి. మేరీ ప్రశాంతి మాట్లాడుతూ డా. బి. ఆర్. అంబేద్కర్ ఒక వ్యతి కాదు ఒక శక్తి అని, ఆయన జీవితం భారత జాతికి గర్వకారణమన్నారు. జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన డా. బి.ఆర్. అంబేద్కర్ జీవితం ప్రతీ స్ఫూర్తి దాయకమైనదన్నారు.డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విజయరాజు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమన్నారు.జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు విజయవాడలో డా. బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం 'సామాజిక న్యాయ మహాశిల్పం' నిర్మాణం, ఆ ప్రదేశంలో నిర్మిస్తున్న కన్వెన్షన్, డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశేషాలను తెలియజేసే లైబ్రరీ, గార్డెన్, తదితర నిర్మాణ విశేషాలను తెలియజేసారు. కార్యక్రమంలో కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్, డీ ఈ ఓ శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. ఎనిమిది రోజులుగా సమ్మెలో ఉన్న మునిసిపల్ కార్మికులు బుధవారం సమ్మెను తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్దకు చేరిన కార్మికుల నుద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి .సోమసుందర్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా దశలవారీగా జరిగిన పోరాటాలకు ప్రభుత్వం స్పందించక పోవడం వల్లనే సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. సమ్మె సమయంలో దఫ దఫాలుగా జరిగిన చర్చల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలోని జేఏసీ కీలకపాత్ర పోషించిందన్నారు. ఇంతకాలమూ నాన్ పి.హెచ్. వర్కర్లకు రాని 6 వేల రూపాయల హెల్త్ అలవెన్స్ ను ఈసమ్మె ద్వారా సాధించి వారికి న్యాయం చేయగలిగామన్నారు. మొత్తం పది కేటగిరీల నాన్ పి.హెచ్. వర్కర్లకు కొత్తగా హెల్త్ అలవెన్స్ నెలకు 6 వేల రూపాయలు వస్తుందన్నారు.

ఆప్కాస్ కార్మికులకు యూనిఫారం, చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వడం , సంక్రాంతి కానుకగా వెయ్యి రూపాయలు ఇవ్వడం , పదవీ విరమణ లబ్ధిగా గ్రాట్యుటీ రూపంలో పదేళ్ళ సర్వీసుకు 75 వేల రూపాయలు , ఆతర్వాత ప్రతీ ఏడాదికి రెండువేల రూపాయలు చొప్పున ఇవ్వడం వంటివి సమ్మె ద్వారా కొత్తగా కార్మికులు సాధించుకున్నవేనని సోమసుందర్ వివరించారు.

ఏ.ఐ.టి.యు.సి. ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ డిమాండ్లలో కొన్నింటికి మాత్రమే పరిష్కారం దొరికిందని, సమానపనికి సమాన వేతనం , కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయడం వంటి డిమాండ్లను కొంతమేరకు ముందుకు తీసుకు వెళ్ళగలిగామని అన్నారు. యూనియన్ అధ్యక్షురాలు కనక మహాలక్ష్మి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు జయసుధ , కార్యదర్శి కే.చంద్రరావు, కోశాధికారి కాటమరాజు, అల్లం నరేంద్ర ,యు.నాగరాజు, ఎం.రామకృష్ణ , ఏడిద నానీ, శివశంకర్, రాజేష్, రవి, కళింగ శ్రీను, ప్రవీణ్, రామాంజనేయులు,లక్కవరపు శ్రీను, రమణ, బాదంపూడి శంకర్, సుబ్బారావు , అల్లం వీర వెంకటలక్ష్మి, సావిత్రి, శారమ్మ, సత్యవతి, వరలక్ష్మి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - గణపవరం: ప్రస్తుత తరాల వారు భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు విశిష్టతను తెలుసు కోవాలని, ఏ స్థాయికి వెళ్లినా జీవన విధానానికి సంబంధించిన విషయాలలో మన సంస్కృతి మూలాలను మరువకూడదని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి విద్యార్థులకు తెలిపారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. ఈ సంబరాలలో విద్యార్థులకు కళాశాల సిబ్బందికి ముగ్గుల పోటీ సాంప్రదాయ వంటలు సాంప్రదాయ వస్త్రధారణ మొదలైన 9 విభాగాల్లో పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె స్వరూప రాణి, డాక్టర్ జి. వెంకట్రావు, డాక్టర్ సిహెచ్ అనురాధ, బి. శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్ చైతన్య, కెవి గణేష్ కుమార్, డాక్టర్ జి.వెంకటరమణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడలిని పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర -భీమవరం: బైపాస్ సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ వై.ఎఫ్. రాష్ట్ర నాయకుడు కడలి మృత్యుంజయుడిని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్ గురువారం నౌదూరులోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మృత్యుంజయుడికి శుభాకాంక్షలు తెలిపి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆనాటి ఎఐఎస్ఎఫ్, వైఎఫ్ ఉద్యమాలను గుర్తుచేసుకుని నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వెనుకబడిన విముక్త జాతుల కార్పోరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: గత పది నెలల నుండి గ్రామపంచాయతీ క్లాప్‌మిత్ర కార్మికులుగా పనిచేస్తున్న వారికి నిధులు విడుదల చేసి వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలంతా జనవరి మాసంలో క్రిస్టమస్, సంక్రాంతి సంబరాలు సందర్భంగా కొత్త బట్టలు కొనుగోలు చేసుకుని, పిండి వంటలు చేసుకుని కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడిపే సంక్రాంతి సందర్భంగా పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాల ఇవ్వకపోవడంలో కార్మికులంతా ఉసురుమంటూ రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు నెలకు కనీస వేతనం రూ .15 వేలు చెల్లించాలని, పంచాయతీరాజ్ ఉద్యోగులం దరికీ ప్రభుత్వం కల్పించే రైతులని పంచాయతీ కార్మికులు కూడా అమలు చేయాలని బుచ్చిబాబు ప్రభుత్వాన్ని కోరారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరం తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పలు ప్రాంతాల్లో చెరువు, పంచాయతీ పోరంబోకు స్థలాలు, పలు రహదారులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునేవారు లేరు. రహదారులు, చెరువు స్థలాలు పరాధీన మవుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. వీటిపై

'స్పందన' లో గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు ప్రకటనలు, హెచ్చరికలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల అండలూరు గ్రామంలో తాగునీటి చెరువుకు చెందిన స్థలం ఆక్రమణకు గురయ్యింది. గతంలో ఇక్కడి ఆక్రమణలను అధికారులు తొల గించారు. తాజాగా కొందరు ఇక్కడి మురుగు బోదెను సైతం పూడ్చేసి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో మరికొందరు సమీప స్థలాల ఆక్రమణలకు సన్నాహాలు చేస్తున్నారు. వీటిపై అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో అక్రమార్కులు మరో అడుగు ముందుకు వేసి ఆయా స్థలాలను క్రయ విక్రయాలు చేస్తున్నారు. తిరిగి మరో ప్రాంతంలో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ఆక్రమణదారులకు కనీసం నోటీసులు ఇవ్వడానికి కూడా యంత్రాగం చొరవ తీసుకోవడంలేదు. రెవెన్యూ శాఖ ద్వారా సర్వే చేయించి చర్యలు తీసుకుంటా మంటూ కాలయాపన చేస్తున్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు విద్యుత్తు సర్వీసులను కూడా ఇవ్వడంతో అక్రమార్కులకు మరింత ఊతమిచ్చినట్లవు తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు ఆక్రమిత, ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

'రా కదలిరా' బహిరంగసభ ఘన విజయం

విశాలాంధ్ర భీమడోలు: వైసిపి నాయకులు చేస్తున్న అక్రమాలు అన్యాయాలతో ప్రజలు విసిగిపో యారని, తెదెపా హయాంలో జరిగిన అభివృద్దే తప్ప ఈ ప్రభుత్వంలో ఎక్కడా అభివృద్ధిలేదని ఏలూరు పార్లమెంటు అధ్యక్షులు గన్ని

వీరాంజనేయులు అన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గన్ని మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. ఏపీ ప్రజలకు వైఎస్సార్సీపీ చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ఎత్తిచూపేందుకు చంద్రబాబు నాయుడురా..కదలిరా... ప్రచారకార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రా కదలిరా బహిరంగ సభల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను ఎత్తిచూపుతు జగన్ రెడ్డి ప్రభుత్వ అవినీతి, అన్యాయాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న చంద్రబాబు రా కదలిరా సభలకు వచ్చే జనసంద్రాన్ని చూసి తాడేపల్లి పిల్లిలో వణుకుడు మొదలైంది. తెదేపా తొలివిజయంఅన్నారు.రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ఆధ్వర్యంలో తెదేపా విజయ ఢంకా మోగించడం ఖాయంఅన్నారు. రాబోయేది తెలుగుదేశం జనసేన ప్రభుత్వమేఅన్నారు.ఈ కార్యక్రమంలో శిరిబత్తిన వీరవెంకట సత్యన్నారాయణ, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్య నాయుడు, శేషాపు శేషగిరి, యడ్లపల్లి శ్రీరామ కృష్ణ, యడ్ల రమేష్ , ఇతర తెలుగుదేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో పలువురికి జనసేన ధర్మరాజు పరామర్శ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వానపల్లి సత్యనారాయణ కుమారుడు వానపల్లి బాలాజీ ఇటీవల మరణించారు. ఆయన కుటుంబ సభ్యుల్ని ఉంగుటూరు నియోజకవర్గం జనసేన

పార్టీ ఇన్‌చార్జి ఉత్సమట్ల ధర్మరాజుకలిసి పరామర్శించారు. మండలంలో పలు గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. ఆయనతోపాటు తోట శ్రీను,జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు మద్దాల లక్ష్మీ రమేష్,చింటు,సురేష్,సత్తి, ఏసు గంగాధర్, వాసు రాజు, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు 89 మంది హాజరు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో టి.టి.డీ.సి బిల్డింగ్ గురువారం నిర్వహించిన మిని జాబ్ ఫెయర్ కు 89 యువత హాజరై 28 మంది వివిధ కంపెనీలలో

ఉపాధి పొందినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినీ జాబ్ ఫెయిర్‌లో హెట్రో డ్రగ్స్, ఇన్నోవసోర్స్, పే.టి.యంల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రంలో జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి మధు భూషణ్ , యుంగ్ ప్రొఫిషన్ ప్రవీణ్, జిల్లా ప్లేస్మెంట్ అధికారి కైకరపు ప్రవీణ్, స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ రాజరాజేశ్వరీ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్యామ్, సునీల్ పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నివాళులు

విశాలాంధ్ర-కైకలూరు: భారత రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యానికి భారతదేశంలో పునాది వేసిన ఏకైక వ్యక్తి డా. బి.ఆర్. అంబేద్కర్ అని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు డా. బి.ఆర్. అంబేద్కర్

విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సామాజిక న్యాయంపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నా యన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనేత జీవత చరిత్ర ఆయన సమాజానికి చేసిన సేవలను ప్రతిఒక్కరూ తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా బి.సి. నాయకులు ఘంటా ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్,ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజవలి,తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సంబరాల్లో ఉత్తమ కవి పురస్కారం

విశాలాంధ్ర - గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ వారు సంక్రాంతి సాహిత్య సంబరాలలో భాగంగా గురువారం గణపవరం గ్రామానికి చెందిన డాక్టర్ యండపల్లి పాండురంగాచార్యులు గణపవరం అన్నపూర్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆయనకు జిల్లా ఉత్తమ కవి పురస్కారంతో

పాటు అయిదు వేల నగదు బహుమతి తో ఏలూరు వై ఎన్ హెచ్ ఏ లో ఘనంగా సన్మానం చేశారు. పాండురంగాచార్యులును ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు), ఎంపీపీ దండు రాము, జడ్పిటిసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, రుద్దరాజు ఫౌండేషన్ చైర్మన్, వర్తక సంఘం అధ్యక్షులు రుద్రరాజు వేంకట సూర్యనారాయణ రాజు (ఆర్ వి ఎస్ రాజు), అక్షర కిరీటి కవి తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, అన్నపూర్ణ డిగ్రీ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి

సంక్రాంతి సంబరాలను ప్రారంభించిన కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగ అని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు.గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వం

యంత్రాంగం, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఎ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సంక్రాంతి సంబరాల్లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి , సాంప్రదాయా లకు నిలువుటద్దంగా కుటుంబ సమేతంగా కలిసి చేసుకునే ప్రత్యేకమైన సంక్రాంతి పండుగను నూతన సంవత్సరంలో మొదటి పండుగగా మూడు రోజులపాటు ఆనందోత్సహాలతో జరిగించుకోవడం ఆచారంగా కొనసాగు తుందని తెలిపారు. ఈ సంక్రాంతి పండుగ ద్వారా కుటుంబ వ్యవస్థ బలపడటమే కాకుండా నేటి సమాజంలో యువతకు సంస్కృతి సాంప్రదాయాలపై మక్కువనుకూడా పెంచడానికి దోహదం చేస్తుందని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి పాల్గొని భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండుగ ఆనందోత్సాహాలతో ప్రజలందరూ ప్రతి సంవత్సరం జరిపించుకోవడం జరుగుతుందని ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ పండుగ జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రతి ఒక్కరికి మార్గదర్శకులు అవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, మార్కెట్ యార్డు చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, నగర డిప్యూటీ మేయర్లు ఎన్.సుధీర్ బాబు,జి. శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం: సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ జిల్లా ఖజానా కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించి ఖజానా కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు

తెలిపారు. సంక్రాంతి సంబరాలు సాంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంసించారు. కోలం ముగ్గులను, బొమ్మల కొలువును అలంకరణలను పరిశీలించి చాలా బాగుందని కితాబు ఇచ్చి, ఈ అలంకరణలో పాల్గొన్న మహిళా సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి అని, కుటుంబ సభ్యులందరూ పండగ రోజుల్లో ఒక చోట చేరి ఆనందోత్సహాలతో సాంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. ఈ వేడుకలలో జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్ హకీం, ఎస్ టి ఓలు జె. రామారావు, ఇ.హిమబిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు, ఎ.వి. శివాజీ, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు యు.వి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-నరసాపురం: మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పుట్టిన రోజు వేడుకలు స్థానిక రాయిపేట కార్యాల యంలో అభిమానులు, తెదేపా కుటుంబ సభ్యులు, వివిధ

పార్టీల నాయకులు, ప్రముఖులు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మందికి పైగా రక్తదానం చేశారు. తెలుగు సంప్రదాయాలకు అద్దం పడుతూ కోలాట నృత్యాలు, గంగిరెద్దు, సన్నాయి మేళాతాళాలతో జన్మదిన వేడుకలను అట్టహాసంగా జరిగాయి.తెలుగు సంప్రదాయాలకు అద్దం పడుతూ కోలాట నృత్యాలు, గంగిరెద్దు, సన్నాయి మేళాతాళాల తో జన్మదిన వేడుక లను అట్టహాసంగా జరిగాయి.

సిఆర్ఆర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-ఏలూరు: సర్ సి.ఆర్. రెడ్డి అటానమస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 'సంక్రాంతి సంబరాలు'ను విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.వి. బాలకృష్ణా రావు భోగి మంటలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు మన తెలుగువారి సంస్కృతి

సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దే శ్యంతో ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటుచేశామన్నారు. చిన్నారులకు భోగిపండ్లు, భోగి మంటలు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు, రంగోళి, మెహందీ, హెూంఫుడ్, గాలిపటాలు, సంప్రదాయ వస్త్రధారణ, జానపద, శాస్త్రీయ నృత్యాలు మొదలైనవి నిర్వహించడం ద్వారా తమ పాత రోజులు జ్ఞాపకం చేశాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు హిందువులకు అతి పెద్ద పండుగైన సంక్రాంతి పండుగ ద్వారా కల్పిస్తాయని వాటి స్ఫూర్తిని మనం గుర్తించుకోవాల న్నారు. ఈ పోటీలలో సర్ సి.ఆర్. రెడ్డి విద్యాసంస్థల నుండి అనేకమంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో విజేత లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఇన్‌చార్జి సెక్రటరీకిలారు ప్రభాకరరావుగారు, కోశాధికారి చిట్టూరి జానకి రామయ్య, అటానమస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎస్.విష్ణుమోహన్, పీ.జీ. కోర్సెస్ కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ఉమెన్స్ కళాశాల కరస్పాండెంట్ పాలడుగు శ్రీరంగం, ఆడిటర్ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎ. రామరాజు, అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

12 నుంచి ఫిబ్రవరి 29 వరకు తాడేపల్లిగూడెంలో ధర్మ ప్రచార మహెూత్సవాలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి జగన్ సంకల్పంతో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ధర్మ ప్రచారంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఈ నెల12వ తేదీ నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మహెూత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. స్థానిక శ్రీబలుసులమ్మ అమ్మ వారి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన దీనికి సంబంధించిన వివరాలను తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్‌కు సమీపంలోని శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం, శ్రీ బలుసులమ్మ కళ్యాణ మండపాలకు మధ్య గల విశాలమైన ఖాళీ స్థలంలో ఈ పూజలు నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంకల్పంతో గత ఏడాది మే 7 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో మహా యజ్ఞం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి ఆశీస్సులతో రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ధర్మ ప్రచారాన్ని చేపట్టిందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో అర్చక అకాడమీ డైరెక్టర్, ప్రఖ్యాత వేద పండితులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కర్ రావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

లివింగ్ శాక్రిప్రైజ్ సేవలు అనిర్వచనీయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా దాహార్తిని తీర్చడం కోసం కొయ్యలగూడెం" లివింగ్ శక్రిప్రైస్" సంస్థ ద్వారా మంచి నీటి బోర్లు, మంచినీటి ట్యాంకులు నిర్మించడం హర్షించదగ్గ విషయమని పరింపూడి

గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. గ్రామంలో మంచినీటి కొరత ఎక్కువగా ఉన్నదని లివింగ్ శక్రి ప్రైస్ సంస్థ వారికి సర్పంచ్ విజయ కుమారి విన్నవించగా ఆమె అభ్యర్థన మేరకు మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో మత్స్యకారుల కాలనీలో లివింగ్ శక్రి ప్రైస్ సంస్థ ద్వారా మూడు లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన బోరు, మంచినీటి ట్యాంకును ఎల్ ఎస్ ఎం సంస్థ ట్రెజరర్ ఎం.ప్రేమకుమారి, సర్పంచ్ విజయ కుమారి, ఎంపీటీసీ సభ్యుడు గంట శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చినబాబు, మత్స్యశాఖ డైరెక్టర్ తాతపూడి గుబ్బాలు, సంస్థ సభ్యులు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్నగూడెంలో ఆలయ నిర్మాణం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో దేవరపల్లి కి చెందిన శ్రీకాకుళపు వెంకట నరసింహారావు సుశీల దంపతుల కుమారుడు శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం రోహిణి దంపతులు కోటి రూపాయల

వ్యయంతో ఆలయం నిర్మాణానికి 2022 ఫిబ్రవరి 11వ తేదీన శంకుస్థాపన చేయించారు. అప్పటి నుండి ఆలయ నిర్మాణం కొనసాగుతున్నది శాస్త్రోక్తంగా పెద్ద తిరుపతిలో జరిగే విధంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని దాత శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం తెలిపారు .ఆలయ నిర్మాణ పనులు నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. తనకు ఎర్నగూడెంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం చేపట్టాలని తలంపు కలిగిందని దీనికి దైవం కూడా తోడు కావడంతో ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉరి శరణ్యమని దేవరపల్లి మండల అంగన్‌వాడీలు పేర్కొన్నారు దేవరపల్లిలో గత 31 రోజుల నుండి నిరాహార దీక్ష చేస్తున్న

అంగన్వాడీల వ్యవస్థను దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు అంగన్వాడీలు బాలింతలకు గర్భిణీలకు చిన్న పిల్లలకు ఎన్నో సేవలు చేస్తున్నారని వారి సేవలకు ప్రతిఫలం సరిగ్గా లభించడం లేదని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా అంగన్వాడీలు ఉరి తాళ్ళను బిగించి తమ నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సంఘం నేతలు ఏ పద్మ కామేశ్వరి కే వరలక్ష్మి కే దేవి సావిత్రి కే కుమారి డివిడి లక్ష్మి ఉండవెల్లి మంగతాయారు, సిఐటియు నాయకుడు కే రత్నాజీ, ఎస్.భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు

విశాలాంధ్ర - గోపాలపురం : ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సహేతుకం కాదని గోపాలపురం ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎ. జాన్ బాబు అన్నారు. మండలం లోని సర్వ శిక్ష అభియాన్ పరిధిలో

పనిచేస్తున్న 12 మంది ఎస్ ఎక్స్ ట్రాక్టర్లకు గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుటుంబ పోషణ భారమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి జీతాలు చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కే. శ్రీనివాసరావు, ఎం. నాగేశ్వరరావు, ఎస్.రాజశేఖర్, బోడా వెంకటలక్ష్మి, సిహెచ్ తాతారావు, జి. వెంకటేశ్వరరావు, ఎస్.కె రహమతుల్లా జి. ప్రసన్నకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: గత నెల రోజులుగా తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఎస్మా చట్టాన్ని రద్దు చేసేంత వరకు, అంగన్వాడీలు అదిరేది, బెదిరేది లేదని

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత నెల రోజులుగా ఉండ్రాజవరం మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద గురువారం ఆయన వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ రంగనాయకమ్మ, ఎం జానకి. పి వి ఎస్ ఎస్ లక్ష్మి, విజయ కుమారి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ఆడాలి

విశాలాంధ్ర - గోపాలపురం : క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ఆడాలని కొవ్వూరు డిఎస్పి వి ఎస్ ఎన్ వర్మ తెలిపారు. మండలంలోని వేల చింతలగూడెం గ్రామంలో గత ఎనిమిది రోజులుగా ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం తో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్లో

సాయిరాం కింగ్స్ పై రాజమహేంద్ర వరం లెజెండ్స్ టీం 14 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డీసీఎంఎస్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీల్లో కృష్ణా జిల్లాకు చెందిన విజేత జట్టుకు, ద్వితీయ స్థానం ప్రకాశం జిల్లా జట్లు సాధించాయి. క్రికెట్, వాలీబాల్ పోటీలలో విజేతలైన మహిళ జట్లకు ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన నగదు పురస్కారాన్ని మెమొంటోను డిఎస్పి వర్మ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు, దేవరపల్లి సిఐ కె. రామకృష్ణ చేతులమీదుగా బహుమతులు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధు కృష్ణ, పెన్విర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ థామస్ ఫిలిప్స్ ఎస్ ఐ కే సతీష్ కుమార్, కొర్లపాటి రాము, పిన్నమనేని చినబాబు, గోపాలకృష్ణ క్రీడాకారులు పాల్గొన్నారు.

రిజర్వుడు స్థానాల్లో రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లకు టిక్కెట్లు ఇవ్వొద్దు

విశాలాంధ్ర - అమలాపురం : ముప్పై ఐదేళ్లు ఐఏఎస్‌లుగా కోట్లు సంపాది స్తున్న. ఐఏఎస్‌లు రిటైర్ కాగానే మరోసారి ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో పోటీ చేసి చట్ట సభలకు ఎన్నిక అవుతున్నారని సీనియర్ న్యాయవాది టిడిపి నాయకుడు నాగాబత్తుల శ్రీనివాసరావు విమర్శించారు. అటు ఉద్యోగాలలో రిజర్వేషన్లు పొంది రిటైర్మెంట్ కాగానే సంపాదించిన కోట్లతో రిజర్వుడు నియోజకవర్గాల్లో పదవులకు పోటీ చేసి రెండు రిజర్వేషన్లు పొందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల

సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల్లో ఏళ్ల తరబడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ఎదుగుదల లేకుండా ఉండిపోతున్నారని నాగాబత్తుల ఆవేదన చెందారు. రాజకీయ పార్టీలు కూడా ఐఏఎస్‌లకు పార్టీ టిక్కెట్లు ఇవ్వకుండా పక్కన పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై అందరూ కలసి రావాలని కోరారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని ఆయన హెచ్చరించారు. తాను తెలుగుదేశం పార్టీలో తన గురువు డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పార్టీలో పనిచేస్తున్నానని చెప్పారు. తమకు ఎమ్మెల్యే స్థానానికి అవకాశం కల్పించాలని నాగాబత్తుల కోరారు.

అక్షరలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట అక్షర విద్యా సంస్థల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ బొమ్మలను తయారు చేశారు. వాటిని జగ్గంపేట పోలీసు స్టేషన్ సిబ్బందికి, అగ్నిమాపక కార్యాలయ సిబ్బందికి అందజేసి శు

భాకాంక్షలు తెలిపారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులు రంగవల్లులను అందంగా అలంకరించారు. సాంప్రదాయ వేషధారణలతో చిన్నారులు అలరించారు. బోగీ మంటలు వేసి, సంక్రాంతి వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ పాతంశెట్టి సతీష్, కరస్పాండెంట్ ఆళ్ల రవి కిషోర్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి చేసింది టీడీపీనే

విశాలాంధ్ర - గోపాలపురం : బీసీల సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేసింది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. గురువారం మండలంలోని వాదాలకుంట గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కాకర్ల శ్రీరామ్ అధ్యక్షతన తెదెపా నాయకుల జయహెూ బీసీ

సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అరాచక పాలన చేస్తున్నారని, హత్యలు ప్రశ్నించే వారిపై కేసులు బనాయించి జైలుపాలు చేస్తూ క్రూరంగా హింసిస్తున్నారని దుయ్యబట్టారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయని కార్యకర్త, నాయకుడు సమిష్టిగా కృషిచేసి తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో అధికారులకు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మీరా, రాష్ట్ర మహిళా కార్యదర్శి మజ్జి పద్మావతి, జోన్ 2 కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్, పార్లమెంటు మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉమర్, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రొంగల సత్యనారాయణ, వడ్లమూడి రమేష్, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కాకర్ల రామ తులసి, జేష్ట శ్రీనివాసరావు, ఎంట్ర ప్రగడ మంగారావు, గెడా జగ్గారావు, బీసీ సంఘాల నాయకులు హాజరయ్యారు.

జంట కవులు నల్లా, బివివిలకు సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమలో మూడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి, కళా రంగాలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరులో పాత బస్టాండ్ సమీపంలోని వైఎంహెచ్ఎం హాల్లో గురువారం నిర్వహించిన సాహిత్య సంక్రాంతి సంబరాల్లో 150

మంది కవులతో నిర్వహించిన కవి సమ్మేళనంలో అమలాపురం పట్టణానికి చెందిన జంట కవులు శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, జిల్లా కన్వీనర్ బివివి సత్యనారాయణలను రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్పర్సన్ పిల్లంగోళ్ళశ్రీలక్ష్మి, మహాకవి బోయ భీమన్న సతీమణి బోయిహైమావతి ఘనంగా సన్మానించారు. పండిత శాలువతో, 5000 రూపాయలు నగదుతో, జ్ఞాపకతో వారిద్దరి ప్రతిభను గుర్తించి సన్మానించారు. సన్మానం పొందిన జంటకవులను శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు అభినందించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణంలో ప్రత్తిపాడు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర

మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్ళంరాజు విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పళ్ళంరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హెూదా తీసుకురావడంతో పాటు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఎం. శ్రీరామచంద్రమూర్తి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పెద్దాడ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - రాజానగరం: మండలంలో నరేంద్రపురం గ్రామానికి చెందిన గుత్తల కృష్ణవేణిపై జనవరి 3న హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఐఎఫ్టియు, ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం రాజానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఫ్టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుత్తల కృష్ణవేణి అనే ఒంటరి మహిళ

కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుందని, ఈ నెల 3వ తేది రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన పెంకే దుర్గారావు అనే వ్యక్తితో పాటుగా అతని కుటుంబ సభ్యులు కొంతమంది బ్లేడ్ బ్యాచ్, గుండాలను తీసుకొచ్చి తీవ్రంగా దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. అరుపులు, కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు వచ్చి నన్ను విడిపించారని. పోలీసులకు ఫోన్ చేయడంతో తప్పించుకుని పారిపోయారన్నారు. బాధితురాలు కృష్ణవేణిని రాజానగరం పోలీసులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించార న్నారు. అయితే బాధ్యులపై ఇప్పటి వరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు.తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ పవన్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం.

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: వార్షిక మరమ్మతులు, చెట్లు తొలగించుట తదితర కారణాలుగా శుక్రవారం మండలంలోని పాలంగి, మోర్త, వేలివెన్ను సబ్ స్టేషన్ పరిధిలో ఉ.8:00 నుండి మ. 2:00 వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయము కలుగుతుందని ఏ పి ఈ పి డి సి ఎల్, నిడదవోలు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బి వీరభద్రరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఉండ్రాజవరం, పాలంగి, కే సావరం, చివటం, తాడిపర్రు, వెలగదుర్రు, మోర్త, చిలకపాడు, దమ్మెన్ను, వేలివెన్ను, కాల్దారి గ్రామాల వ్యవసాయ, వాణిజ్య, ఇతర వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. వ్యవసాయ ఫీడర్ల కు 3 పీహెచ్ సరఫరా వేళలు ఉదయం: 5:00 నుండి 8:00 వరకు, మధ్యాహ్నం 2:00 తరువాత సరఫరా ఇచ్చే విధముగా మార్పు చేసినట్లు తెలిపారు